పరిశీలిస్తున్న డిఐజి సెంథిల్ కుమార్

ప్రశాంతంగా ముగిసిన తొలి రోజు

- ఎస్ఐ మెయిన్స్ రాత పరీక్ష
- కేంద్రాలను పరిశీలించిన డిఐజి, ఎస్పీ
- 8,396 మంది హాజరు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఎస్ఐ మెయిన్స్ ఫైనల్ రాత పరీక్షలు కర్నూలులోని 14 పరీక్ష కేంద్రాలలో మొదటి రోజు ప్రశాంతంగా నిర్వహించారు. శనివారం కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో పాటు అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, కర్నూలు సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌లు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఈ పరీక్ష కేంద్రాలలో పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష జరుగుతున్న తీరును, పకడ్బందీ ఏర్పాట్లు, పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఉదయం పేపర్ 1, మధ్యాహ్నం పేపర్ 2 పరీక్షలు నిర్వహించారు. ఆయా రూట్ లలో, స్ట్రాంగ్ రూమ్ లు, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో అన్ని రకాల భద్రత చర్యలు చేపట్టారు. మొత్తం 8,521 మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా 8,396 మంది హాజరయ్యారు. ఇందులో పురుష అభ్యర్థులు 7,537 , మహిళా అభ్యర్థులు 859 మంది హాజరయ్యారు. 125 మంది అభ్యర్థులు గైర్హాజరు అయ్యారు.

వరద బాధిత కాలనీలో

పదేళ్లు గడిచినా అడుగుపెట్టని అధికారులు

- పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పుల్లారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

వరద బాధిత కాలనీలో పదేళ్లు గడిచినా అధికారులు అడుగు పెట్టలేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ.పుల్లారెడ్డి విమర్శించారు. వారి సమస్యలు పట్టించుకోకపోవడంతో నిర్మించుకున్న ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. శనివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం వరద బాధిత కాలనీలో పర్యటించింది.ఈ సందర్భంగా పుల్లారెడ్డి, స్థానికులు యు.మద్దిలేటి, ఎ.మధు మాట్లాడారు. 2009 అక్టోబర్‌లో వచ్చిన భారీ వరదల వల్ల సర్వం కోల్పోయిన తుంగభద్ర నది వెంట ఉన్న పేదలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలో ఇంటి స్థలాలు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారని తెలిపారు. కొందరు ఇల్లు నిర్మించుకొని విద్యుత్ కోసం ఎదురుచూసి చీకట్లో జీవించలేక ఇల్లు ఖాళీ చేసి వెళ్లారని చెప్పారు. ఇంటి నిర్మాణానికి నిర్మించిన నీటి నిల్వ ఔజు శిథిలావస్థకు చేరిందన్నారు. ఇన్ని సమస్యలున్నా అధికారులు ఆ కాలనీలో అడుగు పెట్టలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని విద్యుత్ స్తంభాలు, తాగునీరు ఏర్పాటు చేసి దళితులు, వెనుకబడిన నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. డి.కుమార్, షేక్ సమీవుల్లా, కె.అయ్యన్న, యు.రవీంద్ర, రమణ పాల్గొన్నారు.

కాలనీలో పర్యటిస్తున్న నాయకులు

చేనేత కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని చేనేత పట్టు చీరల ఉత్పత్తి కేంద్రాలను, డైయింగ్ యూనిట్లను ఇన్వెస్ట్ ఇండియా సంస్థ ప్రతినిధి హరిప్రీత్ సింగ్ పరిశీలించారు. శనివారం కర్నూలు జిల్లాకు 'ఒక జిల్లా... ఒక ఉత్పత్తి'లో నమోదు అయిన 'చేనేత పట్టు చీరలు' ఉత్పత్తిని, కోడుమూరు, ఎమ్మిగనూరు మండలాల్లో ఉన్న క్లస్టర్లను ఇన్వెస్ట్ ఇండియా సంస్థ ప్రతినిధి హరిప్రీత్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని కోడుమూరు, ఎమ్మిగనూరులోని 'చేనేత పట్టు చీరలు, వీటిని కర్నూలు జిల్లాకు 'ఒక జిల్లా... ఒక ఉత్పత్తి'లో నమోదు చేసి కేంద్ర ప్రభుత్వానికి అవార్డు ప్రతిపాదనలు పంపి ఉన్నారని తెలిపారు. ప్రతిపాదనలను పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. కోడుమూరులోని సాధారణ చేనేత వస్త్రాలు ఉత్పత్తి కేంద్రాన్ని, బనకన్నా, సోమేశ్, వీరేశ్, సురేష్‌ల మగ్గాలను పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ ప్రోత్సాహకాల ను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం ఆవరణలోని మగ్గాలు నేస్తున్న జయశంకర్, సరోజమ్మ, లీలావతి తదితర చేనేత కార్మికులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు నిర్ణీత గడువులోనే అందుతున్నాయా, ప్రభుత్వం తరఫున ఏ లబ్ధి పొందుతున్నారు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి అవుతున్న చేనేత పట్టు చీరలను, డైయింగ్ యూనిట్లను పరిశీలించారు. వీటికి సంబంధించిన సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని ఆయన తెలిపారు. అనంతరం జౌళి శాఖ ఎడి హరికృష్ణ మాట్లాడారు. కోడుమూరు, ఎమ్మిగనూరు మండలాల్లో అద్భుతమైన చేనేత ఉత్పత్తి అవుతున్నాయన్నా రు. ఈ చీరలు గుంత, ఫ్రేమ్ మగ్గాల మీద నేస్తారని తెలిపారు. ఇవి తేలికగా ఉండి శుభకార్యాలకు ధరించేందుకు బాగుంటాయని చెప్పారు. వీటి అరుదైన డిజైన్ కోసం జకార్డ్ వాడుతారని తెలిపారు. చీరలు నేస్తూనే వీటికి కుట్టు డిజైన్ కూడా వేస్తారన్నారు. ఈ రకమైన చీరలు నేయడం ప్రత్యేకమైన కళ, మంచి నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులే ఈ రకమైన చీరలు నేయగలరని తెలిపారు. ఈ మూడు మండలాల్లో చాలా మంది చేనేత కార్మికులు ఈ రకమైన చీరలు నేస్తున్నారని హరిప్రీత్ సింగ్‌కు వివరించారు. చేనేత, జౌళి శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు చేనేత కోఆపరేటివ్ సొసైటీని హరి ప్రీత్ సింగ్ పరిశీలించారు. స్థానిక వీవర్స్ కాలనీ కో ఆపరేటివ్ సొసైటీలో చేనేతలతో మాట్లాడారు. కర్నూలు జిల్లాకు ఒక ఉత్పత్తిలో నమోదయిన చేనేత పట్టు చీరల ఉత్పత్తిని, జిల్లా యంత్రాంగం ఈ ఉత్పత్తులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేతల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కోఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ డైరెక్టర్ హరి కృష్ణ, కార్యదర్శి వెంకటేశ్వర రావు, చేనేత కార్మికుల ప్రతినిధులు మాచాని శివకుమార్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న హరిప్రీత్ సింగ్

డిసిసి అధ్యక్షులుగా బాబురావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా కె.బాబురావును నియమిస్తూ పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన మంత్రాలయం నియోజకవర్గం ఇన్‌ఛార్జీగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలను గద్దె దించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా పని చేస్తానని పేర్కొన్నారు.

సీజనల్ దోపిడీ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. ఇదే అదునుగా ప్రయివేటు ఆస్ప్ర తుల రోగుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. టెస్టుల పేరుతో డబ్బు లు గుంజుతున్నారు. అవసరం లేకపోయినా అడ్మిట్ చేసుకుం టూ వేల రూపాయాల ఫీజులు వసూలు చేస్తున్నారు. జ్వరంతో ప్రయివేటు ఆస్పత్రికి వస్తే వెంటనే రక్త పరీక్ష పేరిట రూ. 300 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారు. జ్వరం తగ్గితే సరి.. లేదంటే రకాల టెస్టులు, స్కానింగ్‌లు చేయిస్తున్నారు. రోగి పరిస్థితి తీవ్రంగా లేకపోయినా, మందులు వాడితే తగ్గిపోయే పరిస్థితి ఉన్నా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అనవరసరంగా అడ్మిట్ చేసుకుంటున్నాయి. మూడు నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉంచుకుని రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు బిల్లు వేస్తున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా సుమారు 70 ఆసుపత్రులకు అనుబంధంగా ల్యాబ్లు ఉన్నాయి. మరో 35 ల్యాబ్లు ప్రత్యేకంగా ఏర్పాటయ్యాయి. ఇవికాక జిల్లాలో వందల సంఖ్యలో చిన్నపాటి ల్యాబ్లు అనుమతులు లేకుండానే సుమారు 100 వరకు నడుస్తున్నాయి. నిబంధనల ప్రకారం వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తప్పనిసరిగా జిల్లాలో పర్యటించి ఆయా కేంద్రాలను తనిఖీ చేయాల్సి ఉండగా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. చాలామందికి అర్హత లేకపోయినా ల్యాబ్ టెక్నీషియన్లుగా చేర్చుకుంటున్నారు. ఫలితంగా వారిచ్చే రిపోర్టులు సరిగా ఉన్నాయా ? లేదా ? అని కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పెద్దాస్పత్రి ఎదురుగా ఉన్న కార్పొరేట్ ల్యాబ్‌లతోపాటు చాలావాటికి అనుమతులు లేవు. ప్రైవేటు ల్యాబ్ల నిర్వాహకులు ఏజెంట్లను పెట్టుకుని పెద్దాస్పత్రికి వచ్చే రోగులను అక్కడికి తీసుకెళుతున్నారు. పెద్దాస్పత్రిలో కొన్ని పరీక్షలు బయటకు రాసిస్తుండటంతో ఇదే అవకాశంగా రోగులను తీసుకెళ్లి పరీక్షల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఆస్పత్రులో నిబంధనలు పాటించడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వసూలుచేసే ఫీజులు, ఛార్జీల వివరాలను ప్రదర్శించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అర్హతలేని సిబ్బందిని వైద్యసేవలకు ఉపయోగిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన వైద్యరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కపించడం లేదు. ఆస్పత్రిలో ఎంత ఫీజు వేసినా నోరుమూసుకుని కట్టాల్సి వస్తోందని, దీంతో జేబులు ఖాళీ అవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చంద్రబాబు అనారోగ్యం పాలవడంతో టిడిపి శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

యానిమేటర్ల వంటావార్పు

ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కర్నూలు ధర్నా చౌక్ లో 36 గంటల దీక్షలు వంట వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. 10 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని, 15 సంవత్సరాలు దాటిన విఒఎలకు వేతనాన్ని ప్రభుత్వం ఇవ్వాలని, లోగో యాప్ కోసం ప్రభుత్వం 5 జి ఫోన్‌లను ఇవ్వాలని తెలిపారు. రెండో రోజు ధర్నా చేపట్టి డిఆర్‌డిఎ పిడికి వినతిపత్రం సమర్పించారు.

సానుభూతి కోసం టిడిపి సరికొత్త నాటకం

-వైసిపి జిల్లా అధ్యక్షులు రామయ్య

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

అవినీతికి పాల్పడి అరెస్టయిన చంద్రబాబుకు సానుభూతి వచ్చేలా టిడిపి నేతలు సరికొత్త నాటకానికి తెరలేపారని వైసిపి జిల్లా అధ్యక్షులు, కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో వైసిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు చేసిన అవినీతి కుంభకోణాలు మెల్లగా ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. ఇప్పట్లో చంద్రబాబుకు బెయిల్ వచ్చే అవకాశాలు లేకపోవడం, రోజురోజుకూ నిజానిజాలు ప్రజల్లోకి వెళ్లి చంద్రబాబు పేరు ప్రతిష్టలు దిగజారుతుండడంతో దిక్కుతోచక టిడిపి నాయకులు నయా నాటకానికి తెర లేపారని మండిపడ్డారు. జైలులో చంద్రబాబుకు మాన్యువల్‌లోని నిబంధనల ప్రకారం విఐపి ఖైదీకి కల్పించాల్సిన వసతులన్నీ కల్పిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న చంద్రబాబు అవినీతి కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఆయన ఆరోగ్యం, వసతులపై టిడిపి కుట్రపూరితంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జైళ్ల శాఖ అధికారుల వివరణతో అది దుష్ప్రచారమని తేటతెల్లం అయిందని చెప్పారు. టిడిపి నేతల, ఎల్లో మీడియా సానుభూతి ఎత్తుగడ బెడిసికొట్టిందన్నారు. చంద్రబాబు సంపాదించిన కోట్ల రూపాయల ప్రజాధనంతో రాష్ట్రానికి అంతర్జాతీయ, జాతీయ న్యాయవాదులను తీసుకొచ్చినా ప్రయోజనం శూన్యమని దుయ్యబట్టారు. తప్పు చేయకుంటే అరెస్టు చేసే ఉద్దేశం ఎవరికీ లేదన్నారు. చంద్రబాబును అవినీతి కేసుల్లో నుంచి కాపాడుకోవడానికి టిడిపిని ఎవరి కాళ్ల దగ్గరైనా తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యే లోకేష్ ఢిల్లీ తిరుగుతున్నారని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, మైనారిటీ విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.యూనుస్, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవుపూజ ధనుంజయ ఆచారి, కటికే కార్పొరేషన్ డైరెక్టర్ గౌతం, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

19న ఎమ్మిగనూరుకు సిఎం రాక

- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎమ్మిగనూరులో ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన ఖరారు అయిందని జెసి నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. 'జగనన్న చేదోడు' 4వ విడత కింద అర్హులైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. సిఎం పర్యటనలో భాగంగా వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ, ఆదోని రోడ్‌లో హెలిప్యాడ్ స్థలాలను శనివారం జెసి, ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో సిఎం పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగనన్న చేదోడు కార్యక్రమానికి విచ్చేస్తున్న సందర్భంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి విజయవంతం చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నిర్మాణం, వేదిక, బహిరంగ సభ ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, ప్రొటోకాల్ పరంగా తీసుకోవాల్సిన ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సమయం తక్కువగా ఉన్నందువల్ల వేగవంతంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండిళ్లకే సిసి రోడ్డు నిర్మాణం

- పనులలో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని సింగవరంలో కాంట్రాక్టర్ శ్రీనివాసులు సీసీ రోడ్డు నిర్మాణం పనులలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ముందుగా కాల్వలు వేసి సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. నివాస ప్రజలతో ఇబ్బందులు ఎదురై పనులు ఎక్కడ నిలిచిపోతాయోనని ముందుగానే సీసీ రోడ్లు వేసుకోవడం నిధులను తగిన సమయంలో జేబులోకి వేసుకోవడం అలవాటుగా మార్చుకొన్నారు. అధికారులు కూడా ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి అవసరమున్న చోట చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చేయడం లేదు. ఇందుకు నిదర్శనం సింగవరంలో రెండిళ్ళకే సీసీ రోడ్లు వేసి గడపగడప నిధులు రూ.8 లక్షలు వథా అవుతున్నట్లు దర్శనమిస్తున్నాయి. అదీ కూడా పంచాయతీ సిబ్బంది లేకుండా పనులు మొదలెట్టడంపై కాంట్రాక్టర్ విమర్శలకు తావుగా నిలుస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం తగు దృష్టిసారించి ప్రణాళికబద్ధంగా పనులు చేయించాలని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

తుగ్గలి తహశీల్దార్ రవి బదిలీ

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలి తహశీల్దార్ సల్కాపురం రవిని కలెక్టరేట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో సి.బెళగల్ తహశీల్దార్ శివశంకర నాయక్‌ను నియమించారు. తుగ్గలి తహశీల్దార్ రవి 11 నెలలుగా ఇక్కడ పని చేశారు. రెవెన్యూ పరమైన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందారు. ఎన్నికల సమీపిస్తుండడంలో తహశీల్దార్ రవిని బదిలీ చేసినట్లు తెలిసింది. తహశీల్దార్ రవి బదిలీ వెనుక రాజకీయ హస్తం ఉన్నట్లు మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు నిత్యం సేవలు చేస్తున్న తహశీల్దార్ రవి బదిలీని ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు కలెక్టర్ సృజనను శనివారం కోరారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

- మైపర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్
- ముగిసిన ఉపాధి నైపుణ్యాల శిక్షణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని మైపర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ సూచించారు. ఈనెల 9 నుంచి 14 వరకు మైపర్ కళాశాలలో నంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యుత్తమ ఉపాధి నైపుణ్యాల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధిపై గణనీయమైన ప్రభాబం చూపిందన్నారు. ప్రొఫెషనల్ కమ్యూనికేషన్, గోల్ సెట్టింగ్, టైమ్ మేనేజ్‌మెంట్, ఇంటర్వ్యూ సన్నద్ధత, లింక్డ్ఇన్, వివిధ పోర్టల్‌ల ద్వారా జాబ్ అప్లికేషన్ స్ట్రాటజీలు, గ్రూప్ డిస్కషన్‌లు, ఎక్స్‌టెంపోర్ స్పీచ్‌లతో సహా ప్రెజెంటేషన్ నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచన, సమస్య-పరిష్కార సామర్థ్యాల అభివృద్ధి వంటి సమగ్ర కార్యాచరణ-ఆధారిత శిక్షణ సెషన్‌లు ఈ శిక్షణలో ఉన్నాయన్నారు. ఉద్యోగ సవాళ్లను సులభంగా, వృత్తి నైపుణ్యంతో ఎదుర్కోవడానికి వీలు కల్పిస్తాయని తెలిపారు. బహిరంగంగా మాట్లాడే భయాన్ని అధిగమించడానికి ఈ కార్యక్రమం సహాయ పడుతుందన్నారు. ఆత్మవిశ్వాసంతో వేదికపైకి రావడానికి వారిని ప్రోత్సహిస్తుందని చెప్పారు. శిక్షణా కార్యక్రమాన్ని అందించినం నంది ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయ రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్ పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. తైక్వాండోలో పతకాలు సాధించిన విద్యార్థులకు శనివారం నగరంలోని మౌర్య ఇన్ హోటల్‌లో టిజి.భరత్ ఛాంబర్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. భరత్ చేతులమీదుగా విద్యార్థులకు పతకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కడప జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలిపారు. తైక్వాండో మాస్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ... ఇటీవల అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీల్లో కిడ్స్ వరల్డ్ పార్కులో సాధన చేసే విద్యార్థులు అండర్-14 విభాగంలో టి.అఖిల్, విసి.మోహన్ కుమార్, బి.కార్తీక్, సాయిరాం, కె.రెహాన్, టిఎం.ఉమా, టిఎం.హరిప్రియ బంగారు పతకం సాధించారని తెలిపారు. వి.నిఖిల్, ఎస్.వసంత్ కుమార్, బి.కమలేశ్వర్ కాంస్య పతకం సాధించారని చెప్పారు. అండర్-17 విభాగంలో టిఎం.గాయత్రి, పి.హర్షిత్ బెన్నీ, బి.శ్యాంసుందర్, జికె.విశాల్, కె.నవీన్, బి.చిరు చరణ్ తేజలు బంగారు పతకం, దుర్గాప్రసాద్ కాంస్య పతకం సాధించారని తెలిపారు. బంగారు పతకం సాధించిన విద్యార్థులు కడప జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. సీనియర్ మాస్టర్ వీరేష్ బాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంపై ఆందోళన

- టిడిపి కర్నూలు ఇన్‌ఛార్జీ టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్యం పట్ల ఆందోళనగా ఉందని టిడిపి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి కర్నూలు ఇన్‌ఛార్జీ టిజి.భరత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో పాటు ఇతర నేతలంతా కలిసి నగరంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో ప్రజలందరికీ తెలుసన్నారు. టిడిపి నాయకులు నాగేశ్వరరావు యాదవ్, నాగరాజు యాదవ్, శ్రీనివాస మూర్తి, సోమిశెట్టి నవీన్, అబ్బాస్, సత్రం రామకృష్ణుడు, నరసింహులు, రాజు యాదవ్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. **తుగ్గలి** మండలంలోని రామలింగయ్యపల్లిలో మాజీ జెడ్పీ ఛైర్మన్ బత్తిన వెంకట రాముడు మాట్లాడుతూ చేయని నేరానికి అక్రమంగా, అన్యాయంగా జైల్లో పెట్టడం జరిగింది అన్నారు. మాజీ ఎంపిపి కొమ్ము వెంకటేశు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసినందుకు బహుమతి

- డిసిసి మాజీ అధ్యక్షులు సుధాకర్ బాబు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసినందుకు బహుమతి ఇచ్చారని డిసిసి మాజీ అధ్యక్షులు సుధాకర్ బాబు పేర్కొన్నారు. శనివారం డిసిసి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకాలం పార్టీని బలోపేతం చేశామని, జిల్లాలో పార్టీ రూపురేఖలు మార్చామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. అధిష్టానం ఆదేశాలు పాటించడమే కాంగ్రెస్ కార్యకర్త లక్షణమన్నారు. అధిష్టానం నిర్ణయాన్ని ఆమోదిస్తూ ఇంతకాలం తనకు సహకరించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డిసిసి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్త, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు బజారన్న మాట్లాడారు. డిసిసి అధ్యక్షుని మార్పు విషయంలో మరోసారి అధిష్టానం మార్చుకోవాలని కోరారు. సుధాకర్ బాబు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవ అంతా ఇంతా కాదన్నారు

'నవంబర్‌లో చెకుముకి సంబరాలు'

- జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నవంబర్‌లో జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభమవుతాయని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధీర్ రాజు, ఖాజా హుస్సేన్ వెల్లడించారు. శనివారం ప్రభుత్వ అత్యున్నత విద్య అధ్యయన సంస్థ బిక్యాంపు కర్నూలు కళాశాలలో జెవివి చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధీర్ రాజు, ఖాజా హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 15 వేల మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారని ఖాజా హుస్సేన్ తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను, సామర్థ్యాలను వెలికి తీయడంలో జెవివి కృషి చేస్తుందని వారు తెలిపారు. బనగానపల్లె డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.బడే సాహెబ్, రమేష్, లింగరాజు పాల్గొన్నారు.

16న కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 16న కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేడు వెంకటరామిరెడ్డి సంస్మరణ సభ

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

విశ్రాంత అధ్యాపకులు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు వెంకటరామిరెడ్డి సంస్మరణ సభ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.అబ్దుల్లా శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెంకటరామిరెడ్డి శిష్యులు, అభిమానులు, ఎస్ఎఫ్ఐ నాయకులు, సిపిఎం శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్‌టిసిలో పని చేసి మరణించిన వారి పిల్లలకు

17న కౌన్సెలింగ్

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌ఆర్‌టిసిలో పని చేస్తూ జనవరి 1, 2020 నుంచి మరణించిన వారి పిల్లలకు ఈనెల 17న కర్నూలు కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎం టివి.రామం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉభయ జిల్లాలకు చెందిన ఆర్‌టిసిలో పనిచేస్తూ మరణించిన వారి జీవిత భాగస్వామి, పిల్లలు ఇదివరకే సర్టిఫికెట్లు చేసిన వారు సర్టిఫికెట్లతో ఈనెల 17న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో హాజరుకావాలని కోరారు.

21న సిపిటి పరీక్ష

- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన రావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు కర్నూలు జిల్లా నుంచి 108 మందిని షార్ట్ లిస్ట్ చేశామని, వారికి ఈనెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు డిఆర్ఓ మధుసూదన్ రావు శనివారం వెల్లడించారు. 21న ఉదయం 10.30 గంటలకు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫిషియన్సీ ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ విత్ యూసేజ్ ఆఫ్ కంప్యూటర్స్ అండ్ అసోసియేటెడ్ సాఫ్ట్‌వేర్ టెస్ట్ (సిపిటి) పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరు కానున్న 108 మంది అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 9.45 గంటల్లోపు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కోరారు.

క్లస్టర్ వర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న కెవిఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వైస్ ఛాన్సిలర్ సాయి గోపాల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్స్ పొందేందుకు ఈనెల 16 నుంచి 19లోపు ఓఎంఎండిసి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

- సినీ నిర్మాత అగ్రహారం నాగిరెడ్డి

- టేస్టీ బౌల్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాగిరెడ్డి

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ప్రముఖ సినీ నిర్మాత, వైసిపి నాయకులు అగ్రహారం నాగిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని టేస్టీ బౌల్ రెస్టారెంట్ నిర్వాహకులు, క్రికెటర్ అగ్రహారం విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో ఎమ్మిగనూరు ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడలను సినీ నిర్మాత అగ్రహారం నాగిరెడ్డి, వైసిపి నాయకులు అగ్రహారం వీరారెడ్డి, వగరూరు లక్ష్మీకాంత్ రెడ్డి, ఎపియుడబ్ల్యుజె తాలూకా అధ్యక్షులు బి.శ్రీనివాస నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడారు. దసరా పండగ సందర్భంగా వైపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను 10 రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో గెలిచిన వారికి షీల్డ్‌తో నగదు బహుమతులు అందజేస్తామన్నారు. స్నేహభావం, క్రీడా స్ఫూర్తితో అడాలని తెఇపారు. క్రీడాకారులు ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టేస్టీ బౌల్ యజమాని అగ్రహారం వినోద్ రెడ్డి, ఇరు జట్ల కెప్టెన్లు అగ్రహారం విజయ్ కుమార్ రెడ్డి, తట్టే అనిల్ కుమార్, పాత్రికేయులు శరత్ కుమార్, రజాక్, క్రీడాకారుడు నారాయణ పాల్గొన్నారు.

బాబుకు హాని జరిగితే అల్లోకల్లోలమే

- ముఖ్యమంత్రి జగన్‌దే బాధ్యత

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప

ప్రజాశక్తి - ఆదోని

సమావేశంలో మాట్లాడుతున్న మాన్వి దేవేంద్రప్ప

జైలులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి బాగా లేకున్నప్పటికీ వైసిపి నాయకులు హేళనగా మాట్లాడుతూ మానసిక క్షోభకు గురి చేస్తున్నారని, ఆయనకు హాని కలిగితే రాష్ట్రం అల్లోకల్లోలం కావడం ఖాయమని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప తెలిపారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుకు హాని జరిగితే ముఖ్యమంత్రి జగన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులైన లోకేష్, బ్రాహ్మణిలను సైతం కేసులు ఉన్నాయని వేధిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా గవర్నర్ జోక్యం చేసుకొని చంద్రబాబు నాయుడును మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించి, వైద్య చికిత్సలు అందించాలని డిమాండ్ చేశారు. మరోపక్క రాష్ట్రంలో ప్రజలు కరువుతోను, వర్షాల్లేక పంటలు ఎండిపోతుంటే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఫక్రుద్దీన్, రామచంద్ర, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'మాదిగల విశ్వరూప'ను జయప్రదం చేయండి

- ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు బాలస్వామి

ప్రజాశక్తి - ఆదోని

ఎబిసిడి రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్య సాధన కోసం చేపట్టే 'మాదిగల విశ్వరూప' మహా పాదయాత్రను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల బాలస్వామి మాదిగ కోరారు. శనివారం ఆదోని మున్సిపల్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపు కల్లుబావి పిరమిడ్ హైస్కూల్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా ఇన్‌ఛార్జీ డాక్టర్ వైకె.విశ్వనాథ్ మాదిగ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. అలంపూర్ టు హైదరాబాద్ విశ్వరూప మహా పాదయాత్రకు సంఘీభావంగా ఆదోని నియోజకవర్గంలో పాదయాత్రలు మొదలుపెట్టడం కోసం నిర్వహించే సమావేశంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల, పట్టణ, మండల, నియోజకవర్గ మాదిగ ఉపకుల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎంఎస్‌పి జిల్లా నాయకులు పిఎస్.వీరేష్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు బండారి గిడ్డయ్య మాదిగ, మండల నాయకులు దిబ్బనకల్ ఉసేనప్ప మాదిగ, ఎంఆర్‌పిఎస్ మండల మాజీ అధ్యక్షులు ఎస్.శాంతరాజు మాదిగ, మండల నాయకులు గుమ్మల ఈరన్న మాదిగ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలస్వామి

సిఎం జగన్ రాక్షస ఆనందం

- టిడిపి మంత్రాలయ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి, ఆదోని ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి -పెద్దకడబూరు

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాక్షస ఆనందం పొందుతున్నారని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, ఆదోని ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు విమర్శించారు. శనివారం మండలంలోని తారాపురం గ్రామంలో వెలసిన శ్రీఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అక్రమాలు, అవినీతి గురించి, చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల గురించి వివరిస్తామని తెలిపారు. ఈనెల 17న సాయంత్రం 3 గంటల నుంచి కర్నూలు నగరంలోని ఎస్‌టిబిసి కళాశాల నుంచి కలెక్టరేట్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వరకు శాంతియుత ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. టిడిపి మంత్రాలయం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, ఉమాపతి నాయుడు, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, మధుసూదన్ రెడ్డి, కురువ మల్లికార్జున, ఆర్‌టిఎస్ కన్వీనర్ దశరథి రాముడు, మీసేవ ఆంజనేయులు, తలారి అంజి, మహాదేవ, నరసన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి, మీనాక్షి నాయుడు

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తామని ఆదోని కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప తెలిపారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బాబురావును జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎఐసిసి కార్యదర్శి వేణుగోపాల్ నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుని నియామకంపై జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు, జాతీయ నాయకులు రాహుల్ గాంధీకి, రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలుపు దిశలో ముందుకు తీసుకెళ్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదోని పట్టణ కార్యనిర్వాహణ అధ్యక్షులు దిలీప్ దోక, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, కార్యదర్శి సాయినాథ్, ఆదోని యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేశ్, యువ నాయకులు శ్రీనిత్, మనియార్ ఇర్ఫాన్, నాగేష్, మద్దిలేటి, వెంకటేష్ పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లోని హుస్సేన్ పీరా తాత కాంప్లెక్స్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు కెజి.నరసింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్‌కు ముఖ్య అతిథులుగా జిల్లా మీడియా కోఆర్డినేటర్ బి.అబ్రహం, మంత్రాలయం నియోజకవర్గ కోఆర్డినేటర్ మల్లేష్, మండల నాయకులు ఆనంద్ రాజు హాజరయ్యారు. మండల బీసీ అధ్యక్షులు బడే సాబ్, మండల మైనార్టీ అధ్యక్షులు చాంద్ పీరా, మండల ప్రధాన కార్యదర్శి రంగస్వామి పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని 52 బసాపురం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు తహశీల్దార్ చంద్ర శేఖర్, సర్వేయర్ అబ్దుల్ వాహీద్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. రైతులు తమ పొలాలకు సంబంధించిన అడంగల్, పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా గ్రామ వార్డు సచివాలయంలో సంప్రదించాలని తెలిపారు.

మాట్లాడుతున్న భీమిరెడ్డి

తాగునీటి బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - కోసిగి

కోసిగిలోని పులికనుమ రిజర్వాయర్ దిగువ భాగాన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ఎమ్మెల్యే నిధులతో మరో రెండు కొత్త బోర్లు వేయించినట్లు పంచాయతీ ఇన్‌ఛార్జీ ఇఒ చంద్రశేఖర్, వైసిపి యువ నాయకులు రాజేష్ తెలిపారు. శనివారం పులికనుమ రిజర్వాయర్ సమీపంలో సర్పంచి అయ్యమ్మ ఆధ్వర్యంలో రెండు ప్రాంతాల్లో బోర్లు ఒకేసారి వేయించారు. రెండు బోర్లలో మూడించుల మేర నీరు పడినట్లు తెలిపారు. గత 15 రోజుల క్రితం రూ.18 లక్షలతో ఎమ్మెల్యే చేతుల మీదుగా తాగునీటి పైపులైన్ పనులకు భూమి పూజ చేసి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు బోర్లు వేయించగా ప్రస్తుతం రంగప్ప గట్టు వద్ద నుంచి నాడిగేని వీధి, చైతన్య స్కూల్ వరకు పైపు లైన్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పనులు పూర్తయితే పుష్కలంగా మంచినీరు సరఫరా అవుతుందని చెప్పారు. రంగప్ప గట్టు, చైతన్య స్కూల్, నాడిగేని వీధి, మైనారిటీ కాలనీ, ఎన్‌టిఆర్ కాలనీ, గాంధీ నగర్, దగ్గర కాలనీ వాసులకు రక్షిత మంచినీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పైపు లైన్ పనులు శర వేగంగా జరుగుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి, మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డికి, మేజర్ పంచాయతీ సర్పంచి ఎస్.అయ్యమ్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బోర్లు వేస్తున్న ఇఒ చంద్రశేఖర్, నాయకులు రాజేష్

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ రెడ్డి నియామకం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన న్యాయవాది లక్ష్మీనారాయణ రెడ్డిని ఎన్నుకున్నారు. శనివారం ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని విడుదల చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీగా ఉన్న లక్ష్మీనారాయణ రెడ్డిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీతో పాటు జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బాబుకు మెరుగైన వైద్యమందించాలి

- తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న టిడిపి అధినేత చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అవినీతి కేసులు పెట్టి రిమాండ్‌లో సెంట్రల్ జైలులో పెట్టి హింసిస్తున్నారని తెలిపారు. విఐపి గది ఇచ్చి గదిలో ఎటువంటి సౌకర్యాలూ కల్పించడం లేదన్నారు. సెంట్రల్ జైలులో డిహైడ్రేషన్ కావడం, చర్మంపై దద్దుర్లు వస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు ఆరోగ్యానికి, చంద్రబాబుకు ఏదైనా జరిగితే జగన్మోహన్ రెడ్డి బాధ్యత వహించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకొని కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్సలు అందించాలని డిమాండ్ చేశారు.

ఓపెన్ ఇంటర్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ తరగతులను ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ సంజన, ఇన్‌ఛార్జీ, సీనియర్ గ్రంథాలయ అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.గోవిందరాజులు శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... ఓపెన్ ఇంటర్ ఆర్ట్స్ గ్రూపులో 40 మంది, సైన్స్ గ్రూపులో 30 మంది విద్యార్థులు చేరినట్లు వెల్లడించారు. వీరికి ప్రతి ఆదివారం తరగతులు జరుగుతాయన్నారు. పాఠ్యపుస్తకాలు ఇంటికే వస్తాయన్నారు. గణితం, భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, అర్థ శాస్త్రం, హిందీ అధ్యాపకులు శివయ్య, ఈరన్న, రాజేశ్వరి, బడే సాహెబ్, శ్రీనివాసులు బోధన చేస్తారన్నారు. ఓపెన్ ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

పీఠాధిపతులు రాజకీయాలు చేయరాదు

- టిడిపి క్లస్టర్లు ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని టిడిపి మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్ హితవు పలికారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా చేయడంతో 36 రోజులుగా రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన త్వరగా కోలుకొని విడుదల కావాలని రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డిని గర్భగుడిలోకి అనుమతించకపోవడం బాధాకరమన్నారు. అందరికీ ఒకే నియమం ఉండాలని, కాసేపటికే దర్శనార్థం వచ్చిన ఎమ్మెల్యే కుటుంబానికి, వైసిపి నాయకులకు శ్రీమఠం సిబ్బంది దగ్గరుండి అవకాశం కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి శ్రీమఠం అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. గతంలో టిడిపి పాలనలో తుంగభద్ర నది వరదకు శ్రీమఠం తీవ్ర నష్టం జరిగిందని, ఆ సందర్భంలో ప్రభుత్వానికి పన్నుల రూపంలో కట్టాల్సిన సుమారు రూ.58 కోట్లను చంద్రబాబుతో తిక్కారెడ్డి మాట్లాడి దేవదాయ, ధర్మాదాయ శాఖ నుంచి రాయితీ ఇప్పించిన విషయం మరచిపోరాదన్నారు. శ్రీమఠం ఆస్తులను వైసిపి నాయకుల చేతుల్లో పెట్టి తప్పు చేసినా తిక్కారెడ్డి ఏనాడూ ప్రశ్నించలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. టిడిపి అధికారంలోకి రాగానే శ్రీమఠంలో జరిగిన అవినీతి, అక్రమాలను బయట పెడతామని హెచ్చరించారు. శ్రీమఠంలో రాజకీయాలకు అతీతంగా అందరినీ సమానంగా చూడాలని తెలిపారు. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, విజయరామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, జట్టి వీరేష్, వగరూరు అబ్దుల్, మాలపల్లి చంద్ర, వట్టేప్ప గారి నరసింహులు, మేకల నరసింహులు, యోబు, నాగరాజు, రవి, రామయ్య, లింగప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చావిడి వెంకటేష్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

19న ఎమ్మిగనూరుకు ముఖ్యమంత్రి జగన్

- స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరుకు రానున్నారు. నియోజకవర్గానికి మొట్ట మొదటిసారిగా 'వైఎస్ఆర్ చేయూత' ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తున్నారు. శనివారం ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి వీవర్స్ కాలనీ మైదానం సభ స్థలాన్ని పరిశీలించారు. వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎస్‌యుసిఐ నిరసన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

గాజాపై జియోనిస్ట్ ఇజ్రాయెల్ అనాగరిక దిగ్బంధం విధించడాన్ని, పాలస్తీనాపై యుద్ధ నేరాలను ఖండిస్తూ ఎస్‌యుసిఐ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. జిల్లా ఇన్‌ఛార్జీ వి.హరీష్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు నాగన్న మాట్లాడారు. ఇప్పటికే ముట్టడిలో ఉన్న అతి చిన్న భూభాగమైన గాజాపై, పశ్చిమాసియాలోని అమెరికా సామ్రాజ్యవాదానికి బ్రాంచ్ ఆఫీస్‌గా ఉన్న జియోనిస్ట్ ఇజ్రాయెల్ ప్రభుత్వం, పూర్తి దిగ్బంధాన్ని విధిస్తూ చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే దిగ్బంధంలో ఉన్న గాజాపై ప్రస్తుతం ఆహారం, నీరు, ఇంధనం, విద్యుత్ సరఫరాపై పూర్తి నిషేధం విధించిందన్నారు. వైమానిక బాంబు దాడులను వెంటనే ఆపాలని, దిగ్బంధాన్ని ఉపసంహరించుకోవాలని తెలిపారు. పాలస్తీనా నుంచి వెంటనే వైదొలగాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి ఎం..తేజోవతి రోజా, ప్రియాంక, బాబు, అఖిల్, మల్లేష్, శక్రప్ప పాల్గొన్నారు.

నేషనల్ హైవే పేరుతో మోసం

- సర్వం నష్టపోతున్న సామాన్యులు

- విహెచ్‌ఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని శివారు ఎమ్మిగనూరు రోడ్డు నుంచి బళ్లారి రోడ్డుకు బైపాస్ రోడ్డు, నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న తప్పిదాల వల్ల సామాన్యులు నష్టపోతున్నారని విరాట్ హిందుస్థాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. శనివారం ఆదోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. హైవేలో సామాన్యులనే కాకుండా మండగిరి పరిధిలోని 167 సర్వే నెంబర్‌లోని నీలకంఠేశ్వర స్వామి మన్యం భూమి 2.5 ఎకరాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. జిఒ 761 ఎంఎ ద్వారా రూపొందించిన ఆదోని మాస్టర్ ప్లాన్ ప్రకారం 150 అడుగుల రోడ్డుకు 260 ఎకరాలు అప్పట్లోనే అలాట్మెంట్ చేశారని తెలిపారు. ఇప్పటికీ దీనిని ఆధారంగానే లేఅవుట్లు, అభివృద్ధి ప్రణాళికలు ఆమోదించారని చెప్పారు. ప్రస్తుతం వేసే రోడ్డుకు దీనిని సెలెక్ట్ చేసుకోకుండా ఆదోనికి కేవలం 800 మీటర్ల దూరంలో కొత్త అలైన్మెంట్‌ను సెలెక్ట్ చేయడం, దీనిని పరిగణనలోకి తీసుకోక పోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ నిర్ణయం ద్వారా రూ.220 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందన్నారు. ఇందులోని కుట్ర, అవినీతిపై విచారణ జరిపించాలన్నారు. గతంలో నేషనల్ హైవే 167 రోడ్డును ఎమ్మిగనూరు రోడ్డులోని బసవేశ్వర సర్కిల్ వరకు వేసి, అక్కడి నుంచి ఆలూరు రోడ్డు లక్ష్మమ్మ ఆర్చి వరకు కలపడం కోసం భూమిని సేకరించి కొంత రోడ్డు కూడా వేశారని తెలిపారు. ఇందు కోసం సుమారు రూ.10 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇప్పుడు దానిని పక్కకు పెట్టేశారని తెలిపారు. ఇది మరో అక్రమమైతే, మొత్తంగా స్టేట్ రోడ్డునే నేషనల్ హైవే 167 రోడ్డుగా అభివృద్ధి చేసిన వారు, ఇక్కడ మాత్రం ఒక కిలో మీటరు వెనక్కి జరిగి మళ్లీ భూసేకరణ మొదలు పెట్టారన్నారు. ముందు నిర్ణయించుకొన్న ప్లాను ప్రకారం కాకుండా కొత్త అలైన్మెంట్ నిర్ణయిండం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఇంతటితో వీరి అక్రమాలు ఆగలేదని, మండగిరి సర్వే నెంబరు 182లోని శ్రీనీలకంఠేశ్వర స్వామి భూమిని పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఆదోని తహశీల్దార్, ఆర్‌అండ్‌బి శాఖకు బదలాయించారని తెలిపారు. వాస్తవానికి దేవుని భూములు ఇతర అవసరాలకు తీసుకోవాల్సి వస్తే హై కోర్టు అనుమతితోనే తీసుకోవాలన్నారు. ఆదోని తహశీల్దార్ హై కోర్టు తీర్పును పక్కన పెట్టి, శాఖకు సంబంధం లేని ఎండోమెంట్ సుమారు 2.5 ఎకరాల భూమిని ఇష్టం వచ్చినట్లు భూ పందేరం చేశారని చెప్పారు. ఇదే విషయం కర్నూలు జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ రాతపూర్వకంగా ఇచ్చారన్నారు. ల్యాండ్ అక్విజేషన్ అధికారి ఆదోని సబ్ కలెక్టర్ వాస్తవ వివరాలను పట్టించుకోకుండా వ్యవహరించడం బాధాకరమన్నారు. దీనికి సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు సమాచార హక్కు చట్టం ద్వారా కోరినా ఇవ్వకుండా తొక్కి పెడుతున్నారని విమర్శించారు. ఈ విషయాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి విన్నవించామన్నారు. విరాట్ హిందుస్థాన్ వ్యవస్థాపక అధ్యక్షులు సుబ్రమణ్య స్వామి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అక్రమాలపై సిబిఐ విచారణ కోరతామన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న రామాంజనేయులు

చేనేత సొసైటీ సభ్యులను ఆదుకోండి

- సహకార సంఘంలో మా వారసులకు ఉద్యోగాలివ్వాలి

- ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'ది ఎమ్మిగనూరు కో ఆపరేటివ్ సొసైటీ' సహకార సంఘం సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం సభ్యులు కె.కృష్ణ, హనుమంతప్ప, రాజేష్, గురు రాజు, నారాయణ, నాగప్ప, లక్ష్మి దేవి, జరీనా కోరారు. శనివారం చేనేత, జౌళి శాఖ కమిషనర్ ఆఫ్ డైరెక్టర్‌తో పాటు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, కలెక్టర్‌కు వినతిపత్రం పంపారు. సహకార సంఘంలో రిటైర్డ్ అయిన గుమాస్తాలను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నారని తెలిపారు. వారితో కాకుండా తమ పిల్లలను చేర్చుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు ఉద్యోగులకు పని భారం లేకున్నా జీతాలు పెంచుతున్నారని తెలిపారు. కూలి రేట్లు రూ.300 వచ్చే విధంగా చూడాలన్నారు. గద్వాల పట్టు చీరలను సంఘం ద్వారా నేయించాలని తెలిపారు. ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. 2016లో ఆర్‌ఆర్‌ఆర్ స్కీమ్ ద్వారా మురవణి వద్ద 607 మంది సభ్యులకు ఇచ్చిన 18.98 ఎకరాల ఇళ్ల స్థలాలను లే అవుట్ చేసి రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని తెలిపారు. సంఘంలో వెరైటీ వస్త్రాలు లేనందున కేవలం 15 డిపోల్లో మాత్రమే అమ్మకాలు జరుగుతున్నాయని చెప్పారు. న్యాయమైన హక్కులను పరిష్కరించాలని కోరారు. లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు.

విచ్చలవిడిగా గుట్కా అమ్మకాలు...

- గుట్కాకు బానిసలై అనారోగ్యం పాలవుతున్న యువకులు - చోద్యం చేస్తున్న సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద మండలంలో గుట్కా ప్యాకెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గుట్కాకు బానిసలై యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చేస్తున్నారు.

హొళగుంద నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉండడంతో అధిక సంఖ్యలో గుట్కా ప్యాకెట్ల రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఏ దుకాణానికి వెళ్లినా తాగడానికి నీరు దొరుకుతుందో, లేదో కానీ గుట్కా ప్యాకెట్లు మాత్రం దర్శనమిస్తాయి. అధికారులకు తెలిసినా తూతూమంత్రంగా దాడులు నిర్వహించి అక్కడక్కడ 1, 2 కేసులు కట్టి చేతులు దులుపుకుంటున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాల వల్ల వ్యాపారులకు అధిక సంఖ్యలో లాభాలు వస్తున్నా, ఎక్కువ శాతం కార్మికులు, యువకులతో పాటు యువతులు, మధ్య తరగతి మహిళలు సైతం బానిసైనట్లు తెలిసింది. నోటి క్యాన్సర్‌తోపాటు రక్తహీనత, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు వచ్చి చేరుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నా యువత పెడచెవిన పెడుతున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి 30 గుట్కా సీట్లు గల ఒక బాక్స్‌ను రూ.100 ప్రకారం కొనుగోలు చేసి రూ.150 నుంచి రూ.200 వరకు వ్యాపారులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

రాష్ట్రాల మధ్య కఠిన చర్యల అమలులో తేడాలు

గుట్కా, మత్తు పదార్థాల కార్యకలాపాలపై కఠిన చర్యలు అమలు చేయడంలో రాష్ట్రాల మధ్య తేడాలు ఉండడం వల్ల గుట్కా, మత్తు పదార్థాల అమ్మకందారులు చెలరేగిపోతున్నట్లు సమాచారం. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆదాయమే ధ్యేయంగా పని చేయడం, ఒక రాష్ట్రం గుట్కా అమ్మకాలు చట్ట విరుద్ధం, నిషేధమంటూ ఆదేశాలు జారీ చేస్తున్నాయి. మరో రాష్ట్రం గుట్కా, మత్తు పదార్థాల వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని భావించడం వల్ల యువతతో పాటు మహిళలు కూడా అనారోగ్యం పాలవుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ఏ రాష్ట్రం కూడా గుట్కా, మత్తు పదార్థాలను అమ్మి లాభాలను ఆర్జించకూడదని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. పక్కన కర్ణాటక రాష్ట్రంలో గుట్కా ప్యాకెట్లు అమ్ముకోవచ్చని ఆదేశించడం వల్ల బహిరంగంగా మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో గుట్కా, మత్తు పదార్థాలు నిషేధించడం వల్ల రహస్యంగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుట్కా వ్యాపారులపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గౌరవనీయులైన నాల్గవ అదనపు కోర్టు కర్నూల్

ఐ.ఎ.నంబర్ 321/2021 in ఓస్ నంబర్: 41/2011

దూదేకుల మస్తాన్ బి అండ్ అదర్స్ ...అర్జీదారులు

డి.ఎండి. కబుల భాష అండ్ 11 అదర్స్ ... ప్రతివాదులు

నోటీసు

ఆంధ్ర రాష్ట్రం నంద్యాల జిల్లా డోన్ మండలం డోన్ నివాసం ఉన్న ఐదో ప్రతివాది మరియు ఎనిమిదో ప్రతివాది అయిన (డి జైన బి మరియు డి నూర్జహాన్) అను వారిపైన అర్జీదారులు రెస్టోర్ చేయమని పైన తెలిపిన కోర్టు నందు అర్జీ దాఖలు చేసి ఉన్నారు. మీకు కోర్టు ద్వారా నోటీసులు ఎన్నిసార్లు పంపించిన కూడా నోటీసు తీసుకోనందున గౌరవకోర్టు వారు పేపర్ కు ఆర్డర్ ఇచ్చి ఉన్నారు. కాబట్టి మీకు ఏమైనా అభ్యంతరములు ఉండినచో తేదీ:09.11.2023 ఉదయం 10:30 గంటలకు హాజరై మీరు గాని మీ తరఫున న్యాయవాది కానీ పై కోర్టు నందు తెలుపగలరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు

శ్రీ ఆళ్లగడ్డ చంద్రశేఖర రావు

శ్రీ కడియాల రామపుల్లయ్య

అర్జీదారులు యొక్క న్యాయవాదులు,

కర్నూల్,

సెల్: 7981540503, 9390025038

మహారాజశ్రీ కుటుంబ న్యాయస్థానం

జడ్జి గారి కోర్టు, ఖమ్మం

ఎఫ్.సి.ఓ.పి. నెం. 202/2022

బిట్వీన్ :

పెనుగంటి విజయ గౌరి అలియాస్ నర్సంపల్లి విజయ గౌరి ...పిటిషనర్

మరియు

పెనుగంటి భరత్ కుమార్ ... రెస్పాండెంట్

రెస్పాండెంట్ :

పెనుగంటి భరత్ కుమార్, S/o. లేట్ రాములు, వయస్సు: 45 సం॥ వృత్తి : ప్రైవేట్ ఉద్యోగం, నివాసం: C/o. యం.డి. యూసఫ్ బేగ్, డోర్ నెం. 9/8, షాదిఖానా ఎదురుగా, సిరివెల్ల గ్రామం, సిరివెల్ల మండలం, కర్నూలు జిల్లా. ఆ.ప్ర.

నోటీస్

పైన తెలిపిన పిటిషనర్, రెస్పాండెంట్ అయిన మీపై పైన తెలిపిన కోర్టు నందు విడాకుల కొరకు ఎఫ్.సి.ఓ.పి. నెం. 202/2022ను దాఖలు పరిచినారు. మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను మీకు ముట్టనందున కోరు వారి అనుమతితో ఇట్టి నోటీస్ ఇవ్వనైనది. ఇట్టి కేసు ది. 18-10-2023 ఉదయం గం. 10.30 ని॥ లకు వాయిదా ఉన్నది. ఆరోజున మీరు స్వయంగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గానీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు కాగలరు. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

॥ కోర్టు వారి అనుమతితో ॥

ఖమ్మం

తేది 14-10-2023

ఉబ్బన రామకృష్ణ

న్యాయవాది,

జిల్లా కోర్టు, ఖమ్మం

సెల్ నెం : 9849512963

ప్రజాశక్తి
ఆదివారం 15 అక్టోబర్ 2023
5
నంద్యాల



సీజనల్ దోపిడీ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. ఇదే అదునుగా ప్రయివేటు ఆస్పత్రుల రోగుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. టెస్టుల పేరుతో డబ్బులు గుంజుతున్నారు. అవసరం లేకపోయినా అడ్మిట్ చేసుకుంటూ వేల రూపాయాల ఫీజులు వసూలు చేస్తున్నారు. జ్వరంతో ప్రయివేటు ఆస్పత్రికి వస్తే వెంటనే రక్త పరీక్ష పేరిట రూ. 300 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారు. జ్వరం తగ్గితే సరి.. లేదంటే రకాల టెస్టులు, స్కానింగ్‌లు చేయిస్తున్నారు. రోగి పరిస్థితి తీవ్రంగా లేకపోయినా, మందులు వాడితే తగ్గిపోయే పరిస్థితి ఉన్నా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అనవరసరంగా అడ్మిట్ చేసుకుంటున్నాయి. మూడు నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉంచుకుని రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు బిల్లు వేస్తున్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితోపాటు 108 ప్రైవేటు ఆసుపత్రులు ఉండగా 68 ల్యాబ్లు ఉన్నాయి. ఇందులో 20 వరకు అనధికారికంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రానికి నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, పాణ్యం నియోజక వర్గాలతోపాటు ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి బాధితులు వస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేటుకు వెళ్తున్నారు. జ్వరం వచ్చిందంటే చాలు స్కానింగ్, ఎక్స్ రే, డెంగీ, మలేరియా వంటి పరీక్షలు చేస్తున్నారు. అన్ని పరీక్షలు చేయించుకుని రూ.లక్షల్లో ఖర్చుచేసినా సరైన వైద్యం అందక కొందరు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. పెద్దాస్పత్రిలో కొన్ని పరీక్షలు బయటకు రాసిస్తుండటంతో ఇదే అవకాశంగా రోగులను తీసుకెళ్లి పరీక్షల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఆస్పత్రులో నిబంధనలు పాటించడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వసూలుచేసే ఫీజులు, ఛార్జీల వివరాలను ప్రదర్శించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అర్హతలేని సిబ్బందిని వైద్యసేవలకు ఉపయోగిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన వైద్యరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఆస్పత్రిలో ఎంత ఫీజు వేసినా నోరుమూసుకుని కట్టాల్సి వస్తోందని, దీంతో జేబులు ఖాళీ అవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చంద్రబాబు అనారోగ్యం పాలవడంతో టిడిపి శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

యానిమేటర్ల వంటావార్పు

ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నంద్యాల కలెక్టరేట్ వద్ద 36 గంటల దీక్షలు వంట వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. 10 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని, 15 సంవత్సరాలు దాటిన విఒఎలకు వేతనాన్ని ప్రభుత్వం ఇవ్వాలని, లోగో యాప్ కోసం ప్రభుత్వం 5 జి ఫోన్‌లను ఇవ్వాలని తెలిపారు. రెండో రోజు ధర్నా చేపట్టి డిఆర్ఒకు వినతిపత్రం సమర్పించారు.

మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా

మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి

- ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టి. రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు తక్షణమే ప్రారంభించి కొనుగోళ్లు చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి. రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నంద్యాలలోని టి.నరసింహయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంద్యాల జిల్లాలో 1 లక్షా 35 వేల 710 ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్లో రైతాంగం మొక్కజొన్న పంట సాగు చేశారని తెలిపారు. పంట వేసినప్పుడు మొలక దశలో వర్షాలు ఎక్కువై, కంకి దశలో వర్షాలు లేక కేవలం ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని చెప్పారు. అరకొర వచ్చిన పంటనైనా అమ్ముకుందామంటే ప్రైవేటు వ్యాపారస్తులు క్వింటా రూ. 1,800 నుండి రూ. 1,900 మాత్రమే అడుగుతున్నారని చెప్పారు. డబ్బులు కూడా 7 నుండి 10 రోజుల వరకు చెల్లించని పరిస్థితి ఉండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు ఒక ఎకరా భూమి సాగుకు 40 వేల రూపాయల వరకు ఖర్చు పెట్టారని, ప్రస్తుతం అరకొర వచ్చిన పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలు కావడం లేదని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర మాత్రం క్వింటా 2,090 రూపాయల వరకు ఉంటే మధ్య దళారులు తక్కువ ధరకే కొని రైతాంగాన్ని మోసం చేస్తున్నారని అన్నారు. మద్దతు ధరల చట్టాలు చేయడం తప్ప వాటిని అమలు చేయడం చేతగాని ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మొక్కజొన్నలు పండించిన రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. విత్తనం దగ్గర నుండి పంట అమ్ముకునే వరకు రైతుకు అండగా ఉంటామని రైతు భరోసా గురించి గొప్పలు చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఈ ఒక్క రైతు భరోసా కేంద్రంలో కూడా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించ లేదని చెప్పారు. ఎన్నికల కోసం గొప్పలు చెప్పుకోవడం తప్ప ఆచరణలో రైతుల కోసం చేసిన చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్య వైఖరితో ఉన్నాయని విమర్శించారు. కేవలం ప్రైవేట్ వ్యాపారస్తులు ఇచ్చే కాసులకు ఆశపడి సకాలంలో రైతుల వద్ద మొక్కజొన్నలు ఉన్నప్పుడు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. రైతుల నుండి పూర్తిగా ప్రైవేటు వ్యాపారస్తులు కొన్న తర్వాత మద్దతు ధరలు అమలు చేసి ప్రైవేట్ వ్యాపారస్తుల బొజ్జలు నింపడం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా, రైతు భరోసా కేంద్రాల ద్వారా జిల్లాలోని రైతులు పండించిన మొక్కజొన్న లన్నింటినీ మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలా జరగని పక్షంలో జిల్లాలో రైతాంగాన్ని సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రైతులకు మద్దతు ధరలతో పాటు, రవాణా చార్జీలు, హమాలీ ఖర్చులు కూడా ప్రభుత్వాలే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామ చంద్రుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

16 నుండి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన

- అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేయండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ఈవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్, వివిధ పార్టీల నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్‌సి)కు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ డిఆర్ఒ పుల్లయ్య, ఆర్డీవో శ్రీనివాసులును ఆదేశించారు. శనివారం పట్టనంలోని టెక్కె మార్కెట్ యార్డు గోడౌన్లో భద్రపరచిన ఈవిఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్‌సి)కు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని డిఆర్ఒను ఆదేశించారు. ఈవిఎంలు భద్రపరిచిన గోడౌన్లో పరిశీలనకు అవసరమైన టేబుళ్లు, కుర్చీలు, టివి, లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్లెక్సీ బ్యానర్ ఏర్పాటు చేయడంతో పాటు బెల్ ఇంజనీర్లకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర స్టేషనరీ సామాగ్రి కొరత లేకుండా చూసుకోవాలన్నారు. బిల్డింగ్ చుట్టూ బారికేడింగ్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గుర్తింపు కార్డులు మంజూరు చేసిన వ్యక్తులనే లోపలికి అనుమతించాలన్నారు. పరిశీలన గది వెలుపలి ప్రాంతంలో సెల్ఫోన్లు డిపాజిట్ చేసేందుకు కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. మెటల్ డిటెక్టర్‌ను ఏర్పాటు చేసి ప్రతి వ్యక్తిని చెక్ చేసి లోపలికి అనుమతించేలా చర్యలు తీసుకోవాలని డిఎస్పి మహేశ్వరరెడ్డిని ఆదేశించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ యంత్రాల పరిశీలన పర్యవేక్షించేందుకు సిసి నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. 12 మంది బెల్ ఇంజనీర్లు, 50 మంది మున్సిపల్ సచివాలయ సిబ్బంది, 40 మంది రెవెన్యూ సిబ్బందిని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలనకు వినియోగిస్తున్నట్లు డిఆర్వో కలెక్టర్‌కు వివరించారు. ఉదయం 9 నుండి సాయంత్రం 7 గంటల వరకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి సూపర్వైజర్ ఆధ్వర్యంలో ఓటింగ్ యంత్రాల పరిశీలన జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులకు జారీచేసిన గుర్తింపు కార్డుదారులను మాత్రమే లోపలికి అనుమతిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూర్చునేందుకు వీలుగా కౌంటర్లలో కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి తరపున అనిల్ అమృత రాజు, సిపిఎం ప్రతినిధి పూల నరసింహులు, సిపిఐ రంగనాయుడు, కాంగ్రెస్ పార్టీ త సయ్యద్ రియాజ్, టిడిపి శివరామిరెడ్డి, నంద్యాల తాసిల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి దసరా మహోత్సవాలు

- ప్రతి రోజూ అమ్మ వారికి అలంకరణ, స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం
- భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో నేటి నుండి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మహోత్సవాలు తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరుగుతాయి. ఉత్సవాలు 15వ తేదిన ప్రారంభమై 24న ముగుస్తాయి. ఈ ఉత్సవాల సందర్భంగా స్వామి వారికి విశేష అర్చనలు, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు ప్రతి రోజూ నిర్వహిస్తారు. ప్రతిరోజు స్వామి అమ్మవార్ల ఉత్సవం, బ్రహ్మోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 15వ తేదీన శైలపుత్రి అలంకారంలో అమ్మవారు, భృంగి వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. 16న బ్రహ్మచారిని అలంకారంలో అమ్మవారు, మయూరి వాహనంపై స్వామి అమ్మవార్లు, 17న చంద్రఘంట అలంకారంలో అమ్మవారు, రావణ వాహనంపై స్వామి అమ్మవార్లు, 18న కుష్మాండ దుర్గా అలంకారంలో అమ్మవారు, కైలాస వాహనంపై స్వామి అమ్మవార్లు, 19న స్కందమాతగా అమ్మవారు, శేష వాహనంపై స్వామి అమ్మవార్లు, 20న కాత్యాయినిగా అమ్మవారు, హంస వాహనంపై పుష్ప పల్లకీ సేవలో స్వామి అమ్మవార్లు దర్శనమిస్తారు. 21న కాలరాత్రి అలంకరణలో అమ్మవారు, గజ వాహనంపై స్వామి అమ్మవార్లు, 22న మహాగౌరీగా అమ్మవారు, నంది వాహనంపై స్వామి అమ్మవార్లు, 23న సిద్ధిదాయనిగా అమ్మవారు, అశ్వ వాహనంపై స్వామి అమ్మవార్లు, 24న భ్రమరాంబ దేవి నిజాలంకరణ, నంది వాహనంపై ఆలయ ఉత్సవం స్వామి అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ గ్రామోత్సవంలో అన్ని రకాల కోలాటం, చెక్కభజన, జానపద నృత్యాలు వంటివి దేవస్థానం ఏర్పాటు చేసింది. ఈ ఉత్సవాలలో స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని భక్తులకు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెద్దిరాజు సూచించారు.

శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన స్వాగత బోర్డులు

ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న ఆల్‌మేవా నాయకులు

ఆరు భవనాల నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్సీకి ఆల్‌మేవా వినతి

ప్రజాశక్తి - నంద్యాల

పిఎంజెవికె కేంద్ర పథకం ద్వారా నంద్యాలకు కేటాయించిన ఆరు భవనాల నిర్మాణాలను ప్రారంభించాలని కోరుతూ ఆల్‌మేవా జిల్లా అధ్యక్షులు ఇమ్రాన్ పాషా ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ ఈసాక్ బాషను కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్మాణ ప్రక్రియ త్వరితగతిన మొదలుపెట్టాలని కోరారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందిస్తూ అధికారులతో మాట్లాడి ఇప్పటికే ఆ స్థలం లో రెండు బోర్లు వేయించామని తెలిపారు. ఒక వారం రోజుల్లో భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అల్‌మేవా జిల్లా గౌరవ అధ్యక్షులు యస్ఎండి.అబులైస్, జిల్లా ప్రధాన కార్యదర్శి యస్ఎండి. సలీం, కార్యవర్గ సభ్యులు మునీర్, ఫోరెస్టర్ జాకీర్, సీనియర్ లాయర్ మదాని తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ నాయకుడు మృతి

- మాజీ ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని పాత సిండికేట్ బ్యాంక్ ఏరియాకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు కరిముల్లా (67) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి కరిముల్లా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, టిడిపి నాయకులు టిప్ టాప్ కలాం తదితరులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ఇద్దరు అంతరాష్ట్ర దొంగలు అరెస్టు

రూ.10.77 లక్షలు, 3 కేజీల గంజాయి, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం
- జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి వెల్లడి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆత్మకూరు పోలీసు స్టేషనులో ఇటీవల నమోదయిన ఆర్‌టిసి బస్సులో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు అంతరాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి నుండి రూ.10,77,500 లక్షలు నగదు, 3 కేజీల గంజాయి మూడు ప్యాకెట్లు, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అరెస్టు చేసిన నిందితులు మహమ్మద్ ఇక్రమ్ ఏ హాఫిజ్ మహమ్మద్ ఇక్రమ్, వసీంలను మీడియా ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన గొల్ల సంజన్న గ్రామం నుండి మూడు లారీల ఉల్లిగడ్డల లోడు తన సొంత లారీ ఒకటి, రెండు లారీలు ఇతర రైతుల నుండి కొనుగోలు చేసి పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లి గూడెం మార్కెట్‌లో అమ్ముకున్నాడని చెప్పారు. ఉల్లిగడ్డలు అమ్మగా వచ్చిన నగదు రూ. 11 లక్షలు బ్యాగ్‌లో పెట్టుకొని ఈ నెల 7న రాత్రి 9 గంటల సమయంలో విజయవాడ నుండి అనంతపురంకు వెళ్లు ఇంద్ర బస్సు ఎక్కి కర్నూలుకు వస్తుండగా అదే బస్సులో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు గుంటూరు బస్టాండ్‌లో ఎక్కారని తెలిపారు. గొల్ల సంజన్న నిద్రపోయే సమయంలో రూ. 11 లక్షలు చోరీ చేసి దోర్నాల వద్ద దిగిపోయారన్నారు. అనుమానంతో గొల్ల సంజన్న ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి సిఐ దర్యాప్తు ప్రారంభించారన్నారు. నిందుతులు ఆత్మకూరు పట్టణ శివార్లలో ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు వారిని పోలీసులు అదుపులోకి తీసుకోని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద ఉన్న రూ. 10,77,500 లక్షలు నగదు, 3 కేజీల గంజాయి, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేవలం వారం రోజుల్లో నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులు వారి ఆదాయం కుటుంబ పోషణకు సరిపోక, తాగుడు, గంజాయి సేవించడం అలవాట్ల వల్ల బస్సు ప్రయాణంలో బ్యాగుల నుండి డబ్బులను దొంగలించడం నేర్చుకున్నారని, నిందుతులు, వారి మిత్రులు మోట సలీం, మోట అస్లాం, ఇస్లాం అహ్మదు, హసీనా అహ్మదు, మోహను, అక్లాత అహ్మద్, విక్రమ్ తదితరులతో కలిసి మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో బస్సు ప్రయాణాలలో ప్యాసింజర్‌లకి చెందిన లగేజీ బ్యాగుల నుండి డబ్బులను దొంగలించడం 2009 నుండి ప్రారంభించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఒరిస్సా సరిహద్దులో గంజాయి కొని సొంత ప్రాంతానికి తీసుకుపోయి ఎక్కువ డబ్బుకు అమ్ముకొంటున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఆత్మకూరు డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ నాగభూషణ్, నంద్యాల సిసిఎస్ సిఐలు రామకృష్ణ, సాదిక్ అలీ, ఆత్మకూరు ఎస్ఐలు కృష్ణమూర్తి, డి .వెంకట నారాయణ రెడ్డి, వెలుగోడు ఎస్ఐ వెంకట ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయి

మాతృత్వం ఒక వరం

- అంతర్జాతీయ ప్రమాణాలతో నంద్యాలలో ఐవిఎఫ్ సెంటర్
- ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ఐ.శివ జ్యోతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాతృత్వం ఒక వరమని, అంతర్జాతీయ ప్రమాణాలతో సీమాంధ్రలో మొట్టమొదటి కార్పొరేట్ ఐవిఎఫ్ సెంటర్ (మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్) నంద్యాలలో ఏర్పాటు చేసినట్లు ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ఐ.శివ జ్యోతి తెలిపారు. శనివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతి స్త్రీ తల్లి కావాలని, బిడ్డ చేత అమ్మా అనిపించుకోవాలని కోరుకుంటుందని అన్నారు. దురదృష్టవశాత్తు తల్లి కాలేనప్పుడు ఆ మహిళ కుంగిపోతుంది, చుట్టూ ఉన్న సమాజం నుంచి వివక్షను ఎదుర్కొంటుందని అన్నారు. సంతానం కోసం ఆమె కొలవని దేవుడంటూ ఉండరని, ఎందరో దంపతులు నేడు సంతాన లేమితో బాధపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం సైన్స్ సాధించిన అపూర్వమైన ప్రగతితో సంతానం లేని వారికి సంతానం ప్రసాదించే స్థాయిలో సైన్స్ అభివృద్ధి సాధించిందని చెప్పారు. పిల్లలు లేని దంపతుల నుండి అండాన్ని, వీర్యాన్ని సేకరించి ల్యాబొరేటరీలో ఫలదీకరణ చేసి టెస్ట్యూబ్ బేబీలను పుట్టించే స్థాయికి సైన్స్ అభివృద్ధి చెందిందని తెలిపారు. ఇలాంటి అధునాతన వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోనికి తెచ్చేందుకు సీమాంధ్రలోనే మెట్టమొదటి కార్పొరేట్ టెస్ట్ ట్యూబ్ బేబి సెంటర్ మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్ ఇప్పుడు నంద్యాలలో ప్రారంభించినట్లు తెలిపారు. నిత్యం అందుబాటులో వైద్యులు ఉంటూ 24 గంటలు వైద్య సేవలు ఇవ్వడమే లక్ష్యంగా మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్ నంద్యాలలో ఏర్పాటు చేశామన్నారు. సీమాంధ్రలో ఇప్పటివరకు కార్పొరేట్ స్థాయి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఎక్కడా లేదన్నారు. నంద్యాలలోనే అత్యాధునాతన సౌకర్యాలు కల్పిస్తూ కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించబోతున్న సెంటర్ మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్ అని చెప్పడంలో అతిశయోక్తి కాదన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోని సంతానాన్ని పొందాలని ఆమె కోరారు. మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్‌లో పిల్లలు లేని దంపతుల కోసం వైద్యులు ఎ.సరిత, ఐ.శివ జ్యోతి ఆధ్వర్యంలో వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఐ.శివ జ్యోతి

చిన్న చెరువు టూరిజం పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

చిన్న చెరువు టూరిస్ట్ రెస్టారెంట్ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చిన్న చెరువు గట్టుపై టూరిస్ట్ రెస్టారెంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి దసరా పండగలోపు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ గ్రీన్ కో ప్రతినిధులకు సూచించారు. శనివారం నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు గట్టుపై టూరిస్ట్ రెస్టారెంట్ వద్ద గ్రీన్ కో ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెస్టారెంట్ బిల్డింగ్ పునర్నిర్మాణ పనులు, చిన్నపిల్లల ఆట వస్తువులకు సంబంధించిన పరికరాలు, జిమ్, ల్యాండ్ స్కేపింగ్, వాకింగ్ ట్రాక్, చెరువు చుట్టూ ప్రమాద నివారణ నిమిత్తం ఏర్పాటు చేసే ఐరన్ రక్షణ ఫెన్సింగ్, ఫుడ్ కౌంటర్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న పనులను వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. అనంతరం చెరువులో బోటింగ్ చేసేందుకు వీలుగా అందుబాటులో ఉంచిన మోటార్ బోట్లు, ఫెడల్ బోట్లను కలెక్టర్ పరిశీలించారు. చిన్న చెరువు రెస్టారెంట్లో జరుగుతున్న పనుల ప్రగతిపై జిల్లా టూరిజం అధికారి సత్యనారాయణ కలెక్టర్‌కు నివేదించారు.

16 నుండి విరామ బైబిల్ తరగతులు

ప్రజాశక్తి - రుద్రవరం : మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చిలో చిన్నపిల్లలకు సోమవారం నుండి విరామ బైబిల్ తరగతులను నిర్వహిస్తున్నట్లు సిఎస్ఐ చర్చి రెవరెండ్ సురేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్న పిల్లలకు ప్రతి ఆదివారం ఆనవాయితీగా పాఠశాల తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నపిల్లలను బాల్యంలోనే దైవ మార్గంలో నడిపించాలనే మంచి ఆలోచనతో విరామ బైబిల్ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను విరామ బైబిల్ తరగతులకు పంపి వారి క్రమశిక్షణకు దోహదపడాలని కోరారు.

మాట్లాడుతున్న రెవరెండ్ సురేష్ బాబు

మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకురాలు రంగమ్మ

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి : కెవిపిఎస్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

దళిత సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ విధానాలతో సిపిఎం పార్టీ ధ్వర్యంలో నేడు కాకినాడలో జరుగు రాష్ట్ర దళిత సదస్సును జయప్రదం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగమ్మ, మండల కమిటీ సభ్యురాలు ఆర్ జయరాణి కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా దళితులపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు. మతోన్మాద శక్తులు రెచ్చిపోతున్నాయని చెప్పారు. ఇంతకాలం దళితులకు రక్షణగా ఉన్న చట్టాలు నీరుగారిస్తున్నారని అన్నారు. పోరాడి సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నవరత్నాలకు దారి మళ్ళించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దళితుల భూములు పెద్దలకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు... సంజామల మండలం పేరుసోమల గ్రామానికి చెందిన నజీర్ బెలుం గ్రామం నాపరాయి గనుల నుండి ప్రొద్దుటూరుకు నాపరాయి బండలను తోలడానికి శ్రీనివాసులు, గోపాల్‌లతో తెల్లవారుజామున ట్రాక్టర్‌లో బయలుదేరాడు. దాదాపు 2.20 గంటల సమయంలో నాగిశెట్టిపల్లె దాటగానే వెనకవైపు బళ్లారికి చెందిన లారీ డ్రైవర్ సర్వేష్ అతివేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామభద్రంపల్లి గ్రామ వాసి గోపాల్‌కు, గిద్దలూరు నివాసి శ్రీనివాసులుకు రక్తగాయాలయ్యాయి. జమ్మలమడుగు క్యాంప్బెల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాసులు (51) కోలుకోలేక మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మృతి చెందిన శ్రీనివాసులు

పైపులైన్ లీకేజీతో నీరు వృధా.. కలుషితం

అదే నీరు ట్యాంకులకు, కొళాయిలకు సరఫరా
- ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - పగిడ్యాల

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల కోసం తాగునీటి వసతి కల్పించేందుకు ఓవర్ హెడ్ ట్యాంకులు, జిఎల్ఆర్ఎస్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి బోరుబావులు వేసి పైపులు ద్వారా నీటిని ట్యాంకులకు సరఫరా చేస్తుంది. అయితే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల పైప్‌లైన్ లీకేజీలై నీరు వృధాగా పోవడమే కాక కలుషితమవుతుంది. అందుకు నిదర్శనం మండల కేంద్రం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన గేటు సమీపాన పైప్‌లైన్ లీకై నీరు వృధాగా పోవడమే.

పగిడ్యాల గ్రామానికి ఆంజనేయ నగర్ గ్రామంలోని బోరుబావి ద్వారా విద్యుత్ మోటార్ అమర్చి పైప్‌లైన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకు నీరు సరఫరా చేస్తారు. ఆ నీటిని గ్రామంలోని కుళాయిలకు సరఫరా చేస్తారు. పైపులైన్ లీక్ కావడంతో నీరు కలుషితమవుతుంది. ఆ నీటినే ట్యాంకులకు, కొళాయిలకు సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని తాగడం వల్ల అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో నీరు కలుషితమై దాదాపు 120 మందికి పైగా అతిసారా వ్యాధి సోకి ఆసుపత్రి పాలయ్యారు. వైద్య సిబ్బంది 24 గంటలు కష్టపడి అతిసారా వ్యాధిని అదుపు చేశారు. నీటి కలుషితం వల్లే అతిసారా సోకిందని వైద్యులు నిర్ధారించారు. కలుషితమైన నీరు తాగి అతిసార వ్యాధి సోకిన ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కళ్లారా చూసిన అధికారులు తాగునీటి పైపులు లీకై నీరు వృధాగా పోవడమే కాక కలుషితమవుతున్నా పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. పాఠశాల సమీపాన పైపులైన్ లీకై నీరు వృధా పోతుందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పాఠశాల సిబ్బంది పేర్కొంటున్నారు. అతిసార వ్యాధి అదుపులోకి తెచ్చి నెల కూడా గడవకముందే మళ్లీ నీరు కలుషితమయితే అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకైన పైపులైను మరమ్మతులు చేసి నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

జడ్పి పాఠశాల ప్రధాన గేటు వద్ద లీకైన పైపులైన్ దృశ్యం

పోస్ట్ కార్డుతో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

సిపిఎస్‌ను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

సిపిఎస్‌ను రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కే సత్య ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఎన్ ప్రతాప్ అధ్యక్షతన సిపిఎస్ రద్దు కోసం పోస్ట్ కార్డు నిరసన ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు పాదయాత్రలో, ఎన్నికల మ్యానిఫెస్టోలో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, నేడు మాట మార్చి జిపిఎస్‌ను అసెంబ్లీ సమావేశాలల్లో ఆమోదించడం దారుణం అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని తప్ప జిపిఎస్‌ను, సిపిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదన్నారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పోస్ట్ కార్డు ద్వారా ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్.ప్రతాప్, జిల్లా ఆడిట్ మెంబరు యు. దస్తగిరి, ఉపాధ్యక్షులు చల్లా బుష్ణయ్య, వై.మనోహర్, ఎం సతీష్, కే గోపాల్, సుధాకర్ , పూజారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుండి చౌడేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో నేటి నుండి 24వ తేదీ వరకు దసరా మహోత్సవాల సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ జీవో రామానుజన్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఉదయం అభిషేకం, కుంకుమార్చన, సాయంత్రం కుంకుమార్చన ,చిన్నతేరు ప్రాకారోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15న చౌడేశ్వరి దేవి శైల పుత్ర అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. 16న బ్రహ్మచారిణి, 17న చంద్రఘంట, 18న కుష్మాండ, 19న స్కందమాత, 20న కాత్యాయని, 21న కాలరాత్రి, 22న మహా గౌరీ, 23న సిద్ధి రాత్రి, 24 చౌడేశ్వరి దేవి తదితర అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. 24న దసరా పండుగ సందర్భంగా షమీ పూజ, సింహ వాహన సేవ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని శ్రీ చక్ర సహిత వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నేటి నుంచి 24వ తేదీ వరకు దేవి శరన్నవారాత్రుల మహోత్సవాలు నిర్వహించనున్నారు. దేవి శరన్నవరాత్రుల మహోత్సవ ఆహ్వాన పత్రికను శనివారం వాసవి మాత సన్నిధిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘంకమిటీ మెంబర్లు, మిత్ర సంఘాల అధ్యక్షులు, వీరబొమ్మ నాగ సత్యనారాయణ, భీమిశెట్టి జయరమకృష్ణ, దిండుకుర్తి నాగేశ్వరరావు, వీర బొమ్మ శ్రీనివాసులు, గ్రంథె కృష్ణమూర్తి, ఈపూరు నాగ కుమారి, అల్వాల రామ్మూర్తి, బచ్చు శ్రీనివాసులు, కల్కి శ్రీనివాసులు, సర్విశెట్టి పార్థసారధి, బలుసా నాగరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. **అవుకు :** అవుకు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం నుండి దసరా సవరణ నవరాత్రులు ప్రారంభమవుతున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు తెలిపారు. ఆదివారం ఉదయం కలశస్థాపనతో ప్రారంభం అవుతుందని, అనంతరం పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు : తహాశీల్దార్

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తహాశీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గోర్లగుట్ట గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షణ పథకానికి సంబంధించిన రీసర్వేపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ హక్కు సమస్యలను పరిష్కరించుకోవడనికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ సత్యదీప్, సర్పంచ్, స్థానిక రైతులు చలమారెడ్డి, నారాయణరెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహాశీల్దార్

మాట్లాడుతున్న టిడిపి నాయకులు రాయపాటి గోవిందు

చంద్రబాబు అవినీతికి పాల్పడలేదు : టిడిపి

ప్రజాశక్తి - పాములపాడు

టిడిపి అధినేత నారా చంద్రబాబు ఎలాంటి అవినీతికి పాల్పడ లేదని, ఆయన ఆరోగ్యం బాగుండాలని, త్వరలోనే బయటికి రావాలని టిడిపి మండల నాయకులు రాయపాటి గోవిందు ఆకాంక్షించారు. శనివారం మల్లికార్జున స్వామి ఆశ్రమంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని అన్నారు. ప్రభుత్వం ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు పద్మావతమ్మ, సావిత్రమ్మ, వెంకట సుబ్బమ్మ, భారతి, రాములమ్మ, మహాలక్ష్మి, వెంకట లచ్చుమ్మ, కళ్యాణి, మమత, మహేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

- 20, 21న ఎస్‌టియు ఆధ్వర్యంలో ఆక్రందన దీక్షలు

ప్రజాశక్తి - ప్యాపిలి

గత రెండు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థికపరమైన బకాయిలు చాలా పెండింగ్లో ఉన్నాయని, తక్షణమే వాటిని చెల్లించాలని ఎస్‌టియు ప్యాపిలి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, చంద్రమౌళి, చిన్నపరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్జిత సెలవు బకాయిలు, జీవిత బీమా బకాయిలు, డిఏ బకాయిలు, 11వ పిఆర్సి బకాయిలు ఇలా చాలా రకాల ఆర్థిక బకాయిలు ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్నాయని, వాటి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఇంతవరకు వాటి చెల్లింపులు జరగలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేల మంది ఉపాధ్యాయులు ఈ చెల్లింపులు జరగక చాలా నష్టపోతున్నారని చెప్పారు. చాలా కాలంగా వాటి కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని ఒక లక్షా డెబ్బై వేల మంది ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు పెండింగ్ లో వున్న అన్ని ఆర్థిక బకాయిలు అన్నిటిని వెంటనే విడుదల చేయాలని, ఈ నెల నెల 19వ తేదీలోపు ప్రభుత్వం విడుదల చేయాలని, లేని పక్షంలో ఎస్టీయు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు 20, 21వ తేదీలలో రెండు రోజులపాటు కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన చేస్తూ ఆక్రందన దీక్షలు చేపడుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మద్దిలేటి, శ్రీనివాసులు, రామాంజనేయులు, మధుసూదన్, శివ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టియు నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

వైసిపి అరాచకాలను తిప్పికొట్టాలి : టిడిపి

ప్రజాశక్తి - రుద్రవరం

సిఎం జగన్ మోహన్ రెడ్డి ఉద్దేశ పూర్వకంగా చంద్రబాబు నాయుడిని జైలు పాలు చేశారని, వైసిపి అరాచకాలను ప్రజలు తిప్పికొట్టాలని టిడిపి నాయకుడు డాక్టర్ గోగిశెట్టి నరసింహారావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు ముందుకు వెళ్లాలన్నారు. మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలా గురుమూర్తి, ఉల్లి వెంకటసుబ్బయ్య, శేఖర్ రెడ్డి, అన్నదాత ఓబులయ్య, గ్రంధి శీను, నాయకులు గోగిశెట్టి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రం నుంచి చంద్రబాబుని దూరం చేసేందుకు జగన్ రెడ్డి కుట్ర

ప్రజా నాయకుడు చంద్రబాబు నాయుడును ప్రజా క్షేత్రం నుంచి దూరం చేసేందుకు సిఎం జగన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని టిడిపి ఎస్సీ సెల్ నంద్యాల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, తెలుగు యువత ఉపాధ్యక్షులు మెట్లు భాస్కర్‌లు అన్నారు. చంద్రబాబును తక్షణమే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించాలని డిమాండ్ చేశారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలో హజరత్ సయ్యద్ షా అహమ్మద్ బాషా ఖాద్రి శుత్తారి యమని దర్గాహ ఊరుసు సందర్భంగా డాక్టర్ సయ్యద్ హుస్సేన్ బాషా ఖాద్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంత మయింది. బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 220 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని, వీరికి బెంగుళూరులో ఆపరేషన్లు నిర్వహించి తిరిగి బనగానపల్లెకు పంపనున్నట్లు తెలిపారు

రోడ్డు సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండలంలోని శాతనకోట గ్రామంలో శనివారం రోడ్డు సమస్యను బ్రాహ్మణకొట్టుకూరు ఎస్సై ఓబులేసు పరిష్కరించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పొలానికి వెళ్లే రోడ్డు ధ్వంసం చేయగా సర్పంచ్ జనార్దన్ గౌడ్ ఫిర్యాదు మేరకు ఎస్సై గ్రామానికి చేరుకొని పరిశీలించారు. రోడ్డును ధ్వంసం చేసిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. చిన్న చిన్న సమస్యలు శాంతియుతంగా పరిష్కరించాలని ఎస్ఐ సూచించారు. ఎస్ఐ సూచన మేరకు సర్పంచి, గ్రామస్తులు రోడ్డును పునరుద్ధరించారు.

అహోబిలంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో స్వామి, అమ్మవారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలా ఆచార్యులు, అర్చక బృందం ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో పాటు అమృతవల్లి అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు అహోబిలానికి భారీగా తరలి వచ్చారు.

హడలెత్తిస్తున్న ఊర కుక్కలు

- గాయాల బారిన వాహనదారులు, విద్యార్థులు - నియంత్రణలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ప్రధాన రహదారులపై ఊర కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇటు బాటసారులను, అటు వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. మండలంలో 21 గ్రామ పంచాయతీలు, 20 గ్రామాలు ఉన్నాయి. ఏ గ్రామంలో చూసిన ఊర కుక్కలు దారిన వెళ్లే వారిపై దాడులు చేయడం, మోటార్ సైకిల్ పై వెళ్లే వాహనదారుల వెంట పరిగెత్తి కరవడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఈ సమయంలో మోటార్ సైకిల్‌పై వెళ్లే వ్యక్తులు భయపడి అతివేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాల బారిన పడి తీవ్ర గాయాల బారిన పడుతున్నారు. కొందరు మృత్యువాత కూడా పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడి చేసి తీవ్ర గాయాలపాలు చేస్తున్నాయి. కుక్కలు కరవడం వల్ల కొందరు రేబిస్ వ్యాధి బారిన పడుతున్నారు. రాత్రి సమయాలలో విపరీతంగా అరవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు కుక్కల నివారణ చర్యలు తీసుకోకపోవడంతో ఏ గ్రామంలో చూసినా కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆయా గ్రామాలలో ఊర కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపైన పదుల సంఖ్యలో గుంపుగా చేరి విద్యార్థులపై, వాహనదారులపై దాడి చేయడానికి ప్రయత్నిస్తున్న ఊర కుక్కలు

చంద్రబాబుకు మెరుగైన వైద్యమందించాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు మెరుగైన వైద్యం అందించాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల పట్టణంలోని మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి భేటీ అయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయాల పరిణామాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు ఏదైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. చంద్రబాబుపై రాజకీయ కక్షతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్రమంగా అరెస్టు చేయించి జైల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. చంద్రబాబుకు రాజమండ్రి జైల్లో సరైన వసతులు కల్పించడం లేదని, ఆరోగ్యం సహకరించకున్నా జైళ్ల శాఖ అధికారులతో ఆరోగ్యంగా ఉన్నారని చెప్పించడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబును ప్రైవేటు వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్ద తిమ్మారెడ్డి, రమణారెడ్డి, పలుకూరు మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డితో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి

ఉపాధి లేక వలస బాటలో ప్రజలు

- టిడిపి రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్

ప్రజాశక్తి - గడివేముల

రాష్ట్రంలో ప్రజలకు ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని టిడిపి రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం గడివేములలోని టిడిపి కార్యాలయంలో మండల నాయకులు దేశం సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాక్షేత్రం నుంచి చంద్రబాబు నాయుడును దూరం చేసేందుకు సిఎం జగన్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని అన్నారు. చంద్రబాబును తక్షణమే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులు బనాయించి 34 రోజులుగా జైలుకే పరిమితం చేసిన జగన్ రెడ్డి అక్కడ కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా ఇబ్బందులపాలు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. నిపుణుల వైద్య బృందంతో నిత్యం పర్యవేక్షణలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఫరూక్, మాజీ జెడ్పిటిసి సీతారాం రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మౌలానా ముస్తాక్ అహ్మద్

18న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల

'కృష్ణా జలాల పునఃపంపిణీ చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ రాయలసీమపై ప్రభావం' అంశంపై ఈ నెల 18న కడపలో జరుగు రాష్ట్ర ప్రాజెక్టుల సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు కోరారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నీటిని పున పంపిణీ పేరుతో రాష్ట్రానికి నష్టం కలిగించే బిజెపి కుట్రలను తిప్పి కొట్టి, వైసిపి చేతగానితనాన్ని నిరసించాలన్నారు. రాష్ట్ర సదస్సుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, టిడిపి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.తులసిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు, ఈశ్వరయ్య, రామచంద్రయ్య, హరినాథ్ రెడ్డి, జగదీష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా కోకన్వీనర్ జి సోమన్న, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

మహిళకు చంద్రబాబు అక్రమ అరెస్టు వివరిస్తున్న మాజీ మంత్రి

యువతలో చైతన్యం రావాలి : మాజీ మంత్రి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించుకోవాలంటే యువతలో చైతన్యం రావాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం ఉయ్యాలవాడ మండలం ఎస్.కొత్తపల్లి గ్రామంలో జరిగిన రచ్చబండలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రజలకు వివరిస్తూ వారి మాటలను విన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో అనంత విద్యాసంస్థల అధినేత అనంతరామ సుబ్బారెడ్డి, కొత్తపల్లె గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి బుగ్గన తనయుడుకి సన్మానం

ప్రజాశక్తి - బేతంచర్ల

విజయ దశమి పండుగను పురస్కరించుకొని శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేందర్ నాథ్ రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోహన్ రావు ఆధ్వర్యంలో శనివారం బేతంచెర్ల పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కందగడ్డల మోహన్, జయచంద్ర, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

వైసిపివి దిగజారుడు రాజకీయాలు

- టిడిపి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్

ప్రజాశక్తి - ఆత్మకూరు

రాష్ట్రంలో వైసిపి రాను రాను దిగజారుడు రాజకీయాలు చేస్తుందని టిడిపి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్ విమర్శించారు. శనివారం ఆత్మకూరులోని ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేసిన వైసిపి ప్రభుత్వం ఆయన ప్రస్తుత అనారోగ్యం పట్ల హేళన చేసి మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే చంద్రబాబునాయుడును సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించి, వారి కుటుంబ సభ్యులందరినీ లోపలికి అనుమతించి వారి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు బులెటిన్ ద్వారా రాష్ట్ర ప్రజలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి మోమిన్ ముస్తఫా, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, తెలుగు యువత నాయకులు గఫూర్, ఖాజా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మోమిన్ అహ్మద్ హుస్సేన్